

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం,15 జూన్ 2025

8 పేజీలు

# కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో యోగాంధ్ర

-యోగా సాధన ట్రయిల్ రన్‌కు విశేష స్పందన -యోగా వృక్షాసన భంగిమలో మానవ హారం
-ఆదివారం ఉదయం బ్రిడ్జి లంకలో జిల్లా స్థాయి యోగాంధ్ర
-జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి - ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



**రాజమహేంద్రవరం, మేజర్‌న్యూస్** : సుందర గోదావరి తీరాన, ప్రభాత కిరణాల వెలుగులో, పక్షుల కిలకిల రావాలు, మనోహర ప్రకృతి దృశ్యాల మధ్య, ఆధ్యాత్మిక శోభ తో విరాజిల్లే కొవ్వూరు గోష్పాద క్షేత్రం విఐపి ఘాట్‌లో "యోగాంధ్ర"రాష్ట్రస్థాయికార్యక్రమం శనివారం విజయ వంతంగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు ఆధ్వర్యంలో జరిగింది. ఆర్డీవో రాణి సుస్మిత కార్యక్రమాన్ని పర్యవేక్షించడం జరిగింది.అత్యంత ఉత్సాహంతో కార్యక్రమంలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, వేద పాఠశాల విద్యార్థులు, వయో వృద్ధులు, మహిళలు, యువత, జిల్లా అధికారులు, వివిధ శాఖల సిబ్బందితో "ఆర్ట్ ఆఫ్ లివింగ్" సంస్థకు చెందిన యోగ గురువు సరోజ యోగాసనాలు వేయించారు. అనంతరం బ్రహ్మకుమారి సోదరి రాజయోగ ధ్యానం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ... ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం నాడు నిర్వహించే కార్యక్రమానికి సన్నద్ధంగా ఈరోజు యోగా సాధన ట్రయల్ రన్ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. గోష్పాద క్షేత్రం అటు ఆధ్యాత్మికంగానూ, ఇటు పర్యాటకం గానూ ప్రాముఖ్యత కలిగిన ప్రాంతమని చెప్పారు. 21వ తేదీన అనేక వేదికల్లో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామని, అన్ని వేదికల్లోనూ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. తూర్పుగోదావరి జిల్లాలో ఏడు లక్షల , 64 వేల మంది (99 శాతం) యోగాంధ్ర కార్యక్రమంలో నమోదు చేసుకున్నట్లు చెప్పారు. ప్రస్తుతం యోగా చేస్తున్నవారు యోగాంధ్ర కార్యక్రమం తర్వాత కూడా యోగ సాధన కొనసాగించాలని, యోగాను తమ జీవనంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. జూన్ 15 ఆదివారం గోదావరి నది మధ్య బ్రిడ్జి లంకలో జిల్లా స్థాయి యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి తెలిపారు. ఈ కార్యక్రమానికి మరో ముఖ్య అతిథిగా విచ్చేసిన కొవ్వూరు శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇచ్చిన పిలుపుమేరకు యోగంధ్ర కార్యక్రమం నిర్వహించుకుంటున్నట్లు చెప్పారు. మనం తీసుకునే ఆహార విషయంలో క్రమ పద్ధతి లేకపోవడం, కంప్యూటర్ల పై అధిక సమయం గడపడం, ఒత్తిడి... తదితర కారణాలవల్ల చిన్న వయసులోనే ఎక్కువమంది మధుమేహం, మోకాళ్ళ నొప్పులు, గ్యాస్ సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ఇటువంటి సమస్యలకి యోగా సాధన మంచి పరిష్కారం చూపుతుందని చెప్పారు.ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏడు పదుల వయసులో ఉన్నా ఇంత ఆరోగ్యంగా ఉండడానికి , పరిమితితో కూడిన ఆహారం తీసుకోవడం, నిత్య యోగా సాధనే కారణమన్నారు. మంచి ఆరోగ్యానికి మానసిక ప్రశాంతతకు ప్రతి ఒక్కరూ యోగ సాధన చేయాలని సూచించారు. జూన్ 21 తేదీన మరింత మంది యోగా సాధన కార్యక్రమం లో పాల్గొనాలని, ఈరోజు వొచ్చిన వారు వారి కుటుంబ సభ్యులతో

- తరువాయి 2లో..

# కూటమి ప్రభుత్వంలో కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు

- ఎమ్మెల్సీ పేరాబత్తుల
- ఎమ్మెల్సీ పేరాబత్తులని మర్యాదపూర్వకంగా కలిసిన మంజేరు శ్రీను



**కాకినాడ,మేజర్‌న్యూస్** : ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్‌ని కాకినాడ జిల్లా టిడిపి పార్టీ కార్యాలయం ఆయన చాంబర్లో రామచంద్రపురం నియోజకవర్గం కాజులూరు మండలం మంజేరు గ్రామం జనసేన పార్టీ నాయకులు, మాజీ సొసైటీ ప్రెసిడెంట్ గండి పాపారావు శ్రీనివాస్ (మంజేరు శ్రీను) తన అనుచరులతో మర్యాదపూర్వకంగా కలిసి కోపరేటివ్ సొసైటీ ఎన్నికల్లో మళ్లీ ప్రెసిడెంట్‌గా అవకాశం కల్పించాలని, కూటమిలో పొత్తు ధర్మాన్ని పాటించాలని, తెలుగుదేశం పార్టీ విజయం కోసం పనిచేసిన నాకు సముచితమైన స్థానం కల్పించాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్సీ రాజశేఖర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో కష్టపడి పనిచేసినవారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని అధైర్య పడద్దని భరోసా ఇచ్చారు.

మత్స్యసంపద సమృద్ధిగా లభించి, మత్స్యకార కుటుంబాలు

# సుఖసంతోషాలతో జీవించాలి

- గంగమ్మ తల్లికి నిర్వహించిన పూజా కార్యక్రమంలో వనమాడి కొండబాబు



**కాకినాడ,మేజర్‌న్యూస్** :మత్స్యసంపద సమృద్ధిగా లభించి,మత్స్యకార కుటుంబాలు సుఖసంతోషాలతో జీవించాలి కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు. వేట విరామం అనంతరం మళ్ళీ సముద్రంలో వేటకు బయలుదేరే సమయంలో కాకినాడ ఎటిమొగ నందు కాకినాడ మెకనైజ్డ్ ఫిషింగ్ బొట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన శ్రీ గణపతి, శ్రీ కాల భైరవస్వామి, శ్రీ మత్స్యనారాయణ, శ్రీ గంగమ్మ తల్లి అమ్మ వార్ల ఆలయంలో మత్స్యకారు లు గంగమ్మ తల్లికి ఘనంగా పూజలు నిర్వహించారు. సముద్ర దేవతగా భావించే గంగమ్మ తల్లిని శాంతింపజేసి, సముద్రంలో ఎటువంటి ప్రమాదాలు కలగకుండా ఉండాలని ప్రార్థిస్తూ హెూమాలు, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గంగమ్మ తల్లికి కుంభం సమర్పించి, ప్రజలందరికీ అన్నదాన కార్యక్రమాన్ని భారీ ఎత్తున నిర్వహించారు. మత్స్య సంపద విరివిగా లభించాలి, మత్స్యకార కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని ఆశిస్తూభక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.ఈసందర్భంగా శాసన సభ్యులు వనమాడి కొండబాబు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వేట ప్రారంభానికి ముందు గంగమ్మ తల్లికి పూజలు నిర్వహించడం మత్స్యకారుల ఆధ్యాత్మిక విశ్వాసానికి నిదర్శనమని, సముద్రం మత్స్యకారులకు జీవనాధారం కావడంతో గంగమ్మ తల్లి ఆశీస్సులు ఉండాలని కోరుతూ శ్రద్ధాభక్తులతో ప్రతి సంవత్సరం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గత వైసీపీ

- తరువాయి 2లో..

పాములేరు వాగులో

# ఇరువురు యువకులు గల్లంతు

- ఆచూకీ కోసం గాలింపు



**రంపచోడవరం, మేజర్‌న్యూస్** : ఏజెన్సీ ప్రాంతానికి విహారయాత్రకు వచ్చిన యువకులు ఇరువురు పాములేరు వాగులో శనివారం గల్లంతయ్యారు. మారేడుమిల్లి మండలం పాములేరు వాగులో శనివారం మధ్యాహ్నం ఇద్దరు యువకులు గల్లంతు అయ్యారు. విజయవాడకు చెందిన సుమారు 10 మంది స్నేహితులతో మారే డుమిల్లి విహార యాత్రకు వచ్చి పాములేరు వాగులో స్నానం చేస్తుండగా సాదీష్ (23), రవితేజ (30) అనే





యువకులు గల్లంతు అయ్యారని మారేడుమిల్లి సీఐ గోపాలకృష్ణ తెలిపారు. విజయవాడ ప్రాంతం నుండి మారేడుమిల్లిఏజెన్సీప్రాంతానికి విహార యాత్రకు స్నేహితులు కలిసి వచ్చిన యువకులు స్నానాలుకు పాములేరు వాగులోకి దిగి కొట్టుకు పోయినట్లు సమాచారం. వారిని రక్షించేందుకు ప్రయత్నించి విఫలం అయ్యారని స్థానికులు పేర్కొన్నారు. స్థానికులు సహాయంతో పోలీసులు గాలింపు చర్యలు మొదలు పెట్టారు. అయితే మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో వర్షం కారణంగా గాలింపు చర్యలకు ఆటంకం ఏర్పడింది. చీకటి పడడంతో ఆదివారం ఉదయం గాలింపు చర్యలు కొనసాగిస్తామనిపోలీసులుతెలిపారు. విహార యాత్రలకు వచ్చే పర్యాటకులు సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో తరచూ ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయి.

# ఆర్డీవో కార్యాలయంలో ఉచిత కంటి వైద్య శిబిరం





కాకినాడ,మేజర్‌న్యూస్ : కాకినాడ రెవెన్యూ డివిజన్ పరిధిలోని రెవెన్యూ ఉద్యోగుల సౌకర్యార్థం డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం కాకినాడ ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు.. రెవెన్యూ అధికారులతో కలిసి ప్రారంభించారు. కాకినాడ రెవెన్యూ డివిజన్ పరిధిలోని వివిధ మండలాలకు చెందిన సుమారు 450 మంది రెవెన్యూ ఉద్యోగులు వారి కుటుంబీకులు ఈ కంటి వైద్య శిబిరంలో పాల్గొని కంటి పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి కంటి శస్త్రచికిత్సలకు ప్రతిపాదించారు.ఈ సందర్భంగా డీఆర్వో వెంకటరావు మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యకలాపాల నిర్వహణలో అత్యంత కీలక పాత్ర పోషించే రెవెన్యూ ఉద్యోగుల సౌకర్యార్థం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం గొప్ప శుభ పరిణామం అని అన్నారు. నిత్యం సమయం లేకుండా ఉద్యోగ పరమైన బాధ్యతలను నిర్వర్తిస్తున్నప్పటికి వ్యక్తిగత ఆరోగ్యాన్ని ఎవరు నిర్లక్ష్యం చేయకూడదన్నారు. ఆరోగ్యపరంగా మానసికంగా దృఢంగా ఉన్నప్పుడే మరింత సమర్థవంతంగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. రెవెన్యూ ఉద్యోగుల అవసరాను దృష్టిలో ఉంచుకుని ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటుచేసిన కాకినాడ రెవెన్యూ డివిజన్ అధికారిని, డా. అగర్వాల్ కంటి ఆసుపత్రివైద్యులనుఈసందర్భంగా డీఆర్వో వెంకటరావు ప్రత్యేకంగా అభినందించారు.కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ పరిపాలన అధికారి డీబీఐ చైనులు, కాకినాడ రూరల్ మండలం తహసిల్దార్ ఎస్ఎల్ఎన్ కూమారి, ఆర్డీవో కార్యాలయం సిబ్బంది కెఎస్వి.సుబ్బారావు, కృష్ణ, దుర్గాప్రసాద్, రమణ మూర్తి, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మల్లేశ్వరంలో యోగాంధ్ర కార్యక్రమం



పెరవలి, మేజర్ న్యూస్ : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం నెల రోజుల పాటు యోగాంధ్ర పేరుతో నిర్వహిస్తున్న మాసోత్సవాలలో భాగంగా జూన్ 14వ తేదీ శనివారంఉదయం మల్లేశ్వరం గ్రామంలో "యోగాంధ్ర" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మల్లేశ్వరం ఎంపీటీసీ కోటిపల్లి దేవికారాణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఏ ఇతర రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్ లో నెల రోజుల పాటు పెద్ద ఎత్తున యోగా శిక్షణ నిర్వహిస్తుందని, ఈ నెల 21 వ తేదీన విశాఖలో "అంతర్జాతీయ యోగా దినోత్సవం" వేడుకలు ప్రపంచ స్థాయిలో జరపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు ప్రణాళికలు చేస్తున్నారని అన్నారు. భారతదేశంలో యోగా అంటే ఆంధ్రప్రదేశ్ గుర్తొచ్చేలాగా "యోగాంధ్ర 2025" ని విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బొలిశెట్టి పట్టాభి రామారావు కోటిపల్లి మురళీకృష్ణ పాములపర్తి కృష్ణమూర్తి మేడ్చర్ల బుజ్జి తదితర నాయకులు ప్రభుత్వ అధికారులు, ప్రజలు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉసులుమర్రులో యోగా దినోత్సవ సన్నాహక మాక్ డ్రిల్



**పెరవలి,మేజర్‌న్యూస్ :** అంతర్జాతీయ యోగా దినోత్సవం అవగాహన కార్యక్రమంలో భాగంగా జూన్ 14 వ తేదీ శనివారం తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం ఉసులుమర్రు గ్రామంలో మండల తాసిల్దార్ కే నిరంజన్ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ యోగకార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా తాసిల్దార్ కే నిరంజన్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో నాయకులు, ప్రజలు, సచివాలయ సిబ్బంది, స్వచ్ఛందంగా పాల్గొనడం జరిగిందన్నారు. ఈ మాక్ డ్రిల్ కార్యక్రమం ద్వారా జూన్ 21నజరగనున్నఅంతర్జాతీయ యోగా దినోత్సవం కోసం ప్రజల్లో అవగాహన కల్పించడం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. ఈయోగాకార్యక్రమంలో తాసిల్దార్ నిరంజన్,హౌసింగ్ ఏఈ జాన్ విక్టర్ బాబు,జనసేన పార్టీ జిల్లాకార్యదర్శి తులాచిన బాబు,గ్రామ సర్పంచ్ వీరమల్ల నాగలక్ష్మి, కూటమి నాయకులు వీరమల్ల రామకృష్ణ, జన్ని చిన బ్రహ్మన్న సహా సచివాలయ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



## -పిఠాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ జి.శ్రీనివాస్

**పిఠాపురం, మేజర్‌న్యూస్ :** ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, తమ వాహనాన్ని నడిపేటప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలని పిఠాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ జి.శ్రీనివాస్ అన్నారు. కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు పిఠాపురం పట్టణ ఎస్సై వి. మణికుమార్ మరియు సిబ్బందితో కలిసి పిఠాపురం పట్టణంలోని ఆటో డ్రైవర్లకు స్థానిక ఉప్పాడ సెంటర్లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆటో డ్రైవర్లకు సేఫ్టీ డ్రైవింగ్ పైన ముఖ్యంగా స్కూల్స్, కాన్వెంట్లు, కాలేజీలు రీఓపెనింగ్ సందర్భంగా... పిల్లలను విద్యార్థులను తీసుకువెళ్లే ఆటోడ్రైవర్లకు నిబంధనలు పాటించాలన్నారు. ఎక్కువమందిని తీసుకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వాహనం నడిపే సందర్భంలోను, రోడ్డుపైన ఎక్కించుకునే సందర్భంలోనూ ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ముఖ్యంగా వాహనం నడిపేటప్పుడు ఎటువంటి మత్తు పానీయాలు సేకరించకూడదని, మద్యం సేవించి ఆటోలు నడపకూడదన్నారు. ప్రమాదాలు నివారించుటకు తీసుకోవలసిన జాగ్రత్తలు పైన అవగాహన సదస్సు నిర్వహించారు.

# కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో యోగాంధ్ర

మొదటిపేజి తరువాయి

కలిసి రావాలని పిలుపు ఇచ్చారు.జిల్లా జాయింట్ కలెక్టర్, నోడల్ అధికారి ఎస్. చిన్న రాముడు మాట్లాడుతూ... ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాధాన్యం ఉన్నందువల్లనే రాష్ట్ర స్థాయి కార్యక్రమానికి ప్రభుత్వం గోష్పాద క్షేత్రాన్ని ఎంపిక చేసిందని చెప్పారు. వాడ,వాడలా యోగ సాధన చేయాలన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం అయిన 21వ తేదీ కూడా ఇదే ఉత్సాహంతో పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత మాట్లాడుతూ.. యోగ ద్వారా మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం లభిస్తాయని చెప్పారు. వృక్షాసనం ఆకృతిలో కూర్చున్న యోగ సాధకులను అభినందించారు. కార్యక్రమాన్ని జయప్రదం చేసిన విద్యార్థులు, అధికారులు, అన్ని శాఖల సిబ్బందికి ఆర్డీవో కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, కొవ్వూరు చైర్ పర్సన్ బావన రత్నకుమారి, డిఎల్డిఓ స్లీవా రెడ్డి, కమిషనర్ టీ నాగేంద్ర కుమార్, వివిధ శాఖల అధికారులు,స్థానిక ప్రజాప్రతి నిధులు,వేద పండితులు, విద్యార్థులు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు, మీడియా,పాల్గొన్నారు.

# మత్స్యసంపద సమృద్ధిగా లభించి, మత్స్యకార కుటుంబాలు సుఖసంతోషాలతో జీవించాలి

మొదటిపేజి తరువాయి

ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా మత్స్య కారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, మత్స్య కారులు కొలిచే గంగమ్మ తల్లి కృపాకటాక్షంతో కూటమి ప్రభుత్వంఅధికారంలోకిరావడం జరిగిందని, మత్స్య కార సమస్యలపై అపారమైన అవగాహన కల్గిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు పాలనలో మత్స్య కారులను అన్ని విధాలా ఆదుకొని వారిలో ఆత్మస్థర్యం నింపారని, ప్రతీ ఏటా ఏప్రిల్ 15 నుండి జూన్ 15 వరకు మత్స్యకారులకు సముద్రంలో వేట నిషేధం అమలు చేయడం ఆనవాయితీగా వస్తుందని, వేట విరామంసమయంలో మత్స్యకారులకు ప్రభుత్వం తరుపున రూ.20 వేల రూపాయలు చొప్పున అందజేసి ఆదుకున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుదేనని అన్నారు. రెండు నెలల వేట విరామం అనంతరం తిరిగి సముద్రంలోకి వేటకు వెళ్లే ముందు మత్స్యకారులు గంగమ్మ తల్లికి పూజలు చేయడం అనాదిగా వస్తున్న ఆచారమని దానిలో భాగంగా కాకినాడ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఆధ్యాత్మిక కార్యక్రమం మరియు అన్నదానం చేపట్టడం సంతోషకరమైన విషయం అన్నారు.

ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు సంగాని నాగేశ్వరరావు, మత్స్యకార నాయకులు బలసాడి రంగారావు, పినపోతు తాతరావు, ఉపాధ్యక్షులు మల్లాడి రాజు, పాలెపు ధర్మారావు, లంకే నూకరాజు, ప్రధాన కార్యదర్శి నాటి ధర్మారావు, కార్యదర్శులు చెక్కా లక్ష్మణరావు, వనమాడి కోయ రాజు, పినపోతు శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ లు లంకాడి వీర్రాజు, కొంపెల్ల రాంబాబు, పొన్నాడ లోకేష్ వర్మ, పేమ్మాడి విశాఖ, ట్రెజరర్ చింతా పెర్రాజు, సంగాని ధర్మారావు తదితరులు ఉన్నారు.

## జూన్ 16న కాకినాడలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం- జిల్లా కలెక్టర్ షణ్మోహన్

**కాకినాడ, మేజర్ న్యూస్** : ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ఏర్పాటు చేయబడిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్ఎస్) కార్యక్రమం జిల్లా స్థాయిలో జూన్ 16వ తేదీన సోమవారం కాకినాడ కలెక్టరేట్ గ్రీవెన్స్ హాలులో ఉదయం 10:00 గంటల నుంచి 01:00 గంట వరకు నిర్వహించడం జరుగుతుందని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరూ విధిగా హాజరు కావాలని ఆయన ఆదేశించారు. మండల స్థాయిలో జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్ఎస్) కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు అందరూ విధిగా ఉదయం 9:30 గంటలకు హాజరుకావాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. అర్జీదారులు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్ఎస్) కార్యక్రమానికి రాలేనప్పుడు, వారి యొక్క అర్జీలను మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్‌వెబ్సైట్ నందునమోదు చేసుకోవచ్చునని తెలిపారు. అర్జీదార్లు వారి యొక్క అర్జీల నమోదు మరియు నమోదైన అర్జీల గురించి వాటి యొక్క స్థితి దానికి సంబంధించి సమాచారం తెలుసుకోవాలి అన్నప్పుడు 1100కి నేరుగా కాల్ చేయవచ్చుని కాకినాడ జిల్లా కలెక్టర్ తెలిపారు.

# నీట్-2025 ఫలితాలలో సత్తా చాటిన ఆదిత్య విద్యార్థులు



కాకినాడ,మేజర్‌న్యూస్ : శనివారం ప్రకటించిన నీట్-2025 ఫలితాలలో 625/720 మార్కులతో వి.సాయి భవ్య హర్షిణి 227వ ఆలిండియా ర్యాంకును సాధించిఆదిత్యవిద్యాపటిమను జాతీయస్థాయిలో ఇనుమడింప చేసారు. ఎన్.టి.ఎ. వారు ప్రకటించిన నీట్-2025 ఫలితాలలో డి.సవన్ కార్తికేయ 109వ ఆలిండియా ర్యాంకు, వి.సాయి భవ్య హర్షిణి 227వ ఆలిండియా ర్యాంకు, మరియు డి. శ్రీనివాస రిషిత్ 890వ ఆలిండియా ర్యాంకులను సాధించారని ఆదిత్య విద్యాసంస్థల సెక్రటరీ ఎన్.కె. దీపక్ రెడ్డి తెలిపారు. ఆలిండియా నీట్-2025 ఫలితాలలో 550 మార్కులు పైన 12 మంది విద్యార్థులు, అత్యున్నత మార్కులు సాధించి, ఆంధ్రప్రదేశ్ విద్యారంగంలో 'ఆదిత్య' అగ్రగామియని ఋజువు చేసుకొందని, ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ ఎన్. శేషారెడ్డి అన్నారు. ప్రతి ఒక్క విద్యార్థికి తగినన్ని టెస్టలతో ప్రాక్టీస్ చేయించామని తెలియజేశారు. ఈ సందర్భంగా విజేతలను ఆదిత్య విద్యాసంస్థల సెక్రటరీ ఎన్.కె.దీపక్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. నీట్ లాంగ్‌టర్మ్ కోచింగ్‌కు అడ్మిషన్లు ఆదిత్య గంగరాజు నగర్ మరియు మారికవలస, విశాఖపట్నంలో ప్రారంభించారని తెలిపారు. ఈ సందర్భంగా ఆదిత్య విద్యాసంస్థల హాస్టల్ డైరక్టర్ ఎన్.లక్ష్మీరాజ్యం, ఆదిత్య విద్యాసంస్థల డైరక్టర్ ఎన్.శృతి, డైరక్టర్ ఎన్. సుగుణ, ప్రిన్సిపాల్స్ జె.మొయిన, పి.సత్యనారాయణ రెడ్డి, కోఆర్డినేటర్ కె.లక్ష్మీకుమార్, అకడమిక్ డైరక్టర్ ఎస్.వి.రాఘవరెడ్డి, ఎస్.పి.గంగిరెడ్డి, ఐఐటి క్యాంపస్ వైస్ ప్రిన్సిపాల్ ఎమ్.ఫణీంద్ర మరియు ఆదిత్య నిర్వహణలో గల ఇతర కేంద్రాలలో గల కళాశాలల ప్రిన్సిపాల్స్ అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను,ఉత్తమ శిక్షణనందించిన అధ్యాపకవర్గాన్ని అభినందించారు.

# శారీరక, మానసిక శ్రేయస్సుకు యోగా



**అమలాపురం, మేజర్ న్యూస్** : ప్రాచీన భారతీయ సాంప్ర దాయం యొక్క అమూల్య బహుమతి అయిన యోగా శారీరక, మానసిక శ్రేయస్సును పెంపొందించడానికి అత్యంత విశ్వసనీయ మార్గాలలో ఒకటి గా ఉద్భవించిందని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అన్నారు. శనివారం ఉదయం ఉద్యోగులు సిబ్బం దితో స్థానిక బాలయోగి స్టేడియం నందు యోగ మాస్టర్ ట్రైనీస్ ద్వారా యోగాంధ్ర ట్రయల్ మాక్ డ్రిల్ నిర్వహించారు. యోగాంధ్ర మాస్టర్ ట్రైనీలు యోగా సనాలు వేస్తూ అందరితో యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిరోజు యోగా సాధన చేసి శారీరక మానసిక ఆరోగ్యం పొందాలని, యోగా సాధనకు రూపాయి ఖర్చు అవసరం లేకుండా చిన్నపాటి స్థలంలో సాధన చేస్తూ ప్రయోజనం పొందవచ్చునన్నారు. యోగా సాధన ద్వారా శారీరక శక్తి మెరుగు పడుతుందన్నారు. భారతీయ వారసత్వ సంపద యోగాసనాల సాధనను నేడు ప్రపంచమంతా అనుసరించ డం మన దేశానికి ఎంతో గర్వకారణమన్నారు. శారీరక రుగ్మతల నుంచి రక్షణ పొందేందుకు తప్పనిసరిగా యోగాసనాలను ఆచరిం చడం ఉత్తమ మార్గంగా ఎంచుకోవాలన్నారు రోజువారి జీవితంలో ఎదురయ్యే ఒత్తిడిని యోగ సాధన ద్వారా అధిగమించవచ్చునన్నారు. నూతన శక్తి శరీరానికి యోగా ద్వారా లభిస్తుందన్నారు. నిత్యం శారీరక శ్రమతో సతమతమయ్యే వారి జీవితంలో యోగాసనాలు దివ్య ఔషధం వంటివన్నా రు.ఆరోగ్యకరమై న జీవితాన్ని సొంతం చేసుకు నేందుకు యోగాసనాలు సాధన ప్రధానమన్నారు. ఆరోగ్యానికి మేలు చేసే యోగ అభ్యాసంతో ప్రతి ఒక్కరిని భాగస్వామ్యం చేయడమే లక్ష్యంతో ప్రభుత్వం యోగా ఆంధ్ర కార్యక్రమాన్ని నెల రోజుల పాటు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. భారత సంస్కృతిలో భాగమైన యోగాను ప్రతి ఇంటికి చేరువచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. యోగాంధ్ర ప్రతిజ్ఞ జిల్లా కలెక్టర్ ఉద్యోగులు సిబ్బంది చేత చేయించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ రాజకుమారి, కలెక్టరేట్ పరిపాలన అధికారి కాశీ విశ్వేశ్వరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.కృష్ణమూర్తి, జిల్లా వ్యవసాయ అధికారి బోసుబాబు, జిల్లా పశుసం వర్ధక శాఖ అధికారి వెంకట్రావు, ఆయుష్ వైద్యాధికారిణి కె.విజయ్ కుమారి, యోగా మాస్టర్లు, ట్రైనీలు, వికాస జిల్లా మేనేజర్ జి.రమేష్, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## శృంగార వల్లభ స్వామి వారిని దర్శించుకున్న భక్తులు

### - వేదపండితుల ఆధ్వర్యంలో స్వామివార్కి ప్రత్యేక అలంకరణ



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్** : పెద్దాపురం మండలం, తిరుపతి గ్రామంలో వేంచేసియున్న శ్రీశ్రీ శృంగార వల్లభ స్వామిని శనివారం వేలాది సంఖ్యలో భక్తులు దర్శించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కార్యనిర్వాణాధికారి వడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రత్యేక దర్శనం టికెట్ల ద్వారా రూ. 2,34,370/-, అన్నదాన విరాళాల ద్వారా రూ. 72,154/-లు, కేశఖండన ద్వారా రూ. 10,040/-, తులాభారం ద్వారా రూ. 550/- లడ్డూ ప్రసాదాల ద్వారా రూ. 27,960/-, కానుక ద్వారా రూ. 116/- మొత్తం రూ. 3,45,190/-లు స్వామివారికి ఆదాయం రావడం జరిగిందని తెలిపారు. వేద పండితులు ఆధ్వర్యంలో స్వామివారిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించడం జరిగింది. అలాగే దేవస్థానం తరపున ఉదయం పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు. అనంతరం భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని,స్వామివారి ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలోవేదపండితులు పెద్దింటి నారాయణా చార్యులు, ఆలయ సిబ్బంది కృష్ణ, ఇతర స్వచ్ఛంద సేవకులు, వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## పిఎం శ్రీ జవహర్ నవోదయలో పేరెంట్ టీచర్ ఎన్నికలు



**పెద్దాపురం,మేజర్‌న్యూస్** : పెద్దాపురం పిఎం శ్రీ జవహర్ నవోదయ విద్యాలయలో శనివారం పేరెంట్ టీచర్ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ బాడీ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికలలో 450 మంది పేరెంట్స్ పాల్గొనగా, 10 మందిని పేరెంట్ ప్రతినిధులుగా ఎన్నుకోవడం జరిగింది. వీరిలో టి.దుర్గ, ఎం.కిశోర్, ఎస్.ఆదిలక్ష్మీ, ఎ.నారాయణ, ఎన్.రామలింగేశ్వరరావు, ఎ.ఉష, శ్రీనివాస్, జి.విష్ణు, పి.శ్రీనివాస్, ఎన్.సూరిబాబులు ఉన్నారు. ఈ సందర్భంగా కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ కె.రామకృష్ణయ్య మాట్లాడుతూ విద్యాలయ అభివృద్ధికి మరియు పురోభివృద్ధికి పేరెంట్స్ సహాయ సహకారాలు ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యాలయంలో విద్యాలయం నుండి ఐదుగురు మెంబర్స్‌ను ఎన్నుకోవడం జరిగింది.వారిలో సనపల సత్యనారాయణ పిజిటి ఇంగ్లీష్, డి.చక్రవర్తి పిటిజి గణితం, వి.జగన్మోహనరావు, పిజిటి హిస్టరి, వి.ప్రేమలత ఎస్.యూ.పి.డబ్లూ టీచర్ మరియు మధుబాల టిజిటి సైన్స్ తదితరులు ఉన్నారు.

# అలయన్స్ క్లబ్ శరవణ ఆధ్వర్యంలో రక్తదానం



**కాకినాడ, మేజర్ న్యూస్** : ఆలయన్స్ క్లబ్ కాకినాడ శరవణ ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ రక్తదాతలు దినోత్సవ సందర్భంగా రక్తదాన శిబిరం స్థానిక రోటరీ బ్లడ్ బ్యాంక్‌లో నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు యాళ్ళ రత్నరావు ముందుగా రక్తదానం చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు. క్లబ్ కార్యదర్శి దూళిపూడి రామకృష్ణ, జిల్లా ఛైర్మన్ పడాల సూర్యనారాయణ రెడ్డి, సభ్యులు కోలా సాయిబాబా, వి.గోవింద్, జి.జయసూర్య, బి.వెంకట లచ్చారావు, ఎం.సతీష్, యాళ్ళ గోపీకృష్ణ రక్తదానం చేసి సేవా భావాన్ని చాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా గవర్నర్ పెంకే గోవిందరాజు హాజరై క్లబ్ సేవా కా ర్య క్ర మా ల ను ప్రశంసించారు. ప్రోగ్రామ్ చైర్మన్ టిఆర్ ఠాగూర్ మాట్లాడుతూ రక్తదానం ఒక మహత్తరమైన కార్యమని వివరించారు. పూర్వ జిల్లా గవర్నర్ కొవ్వూరి మునిరెడ్డి సభ్యులను అభినందించారు. క్లబ్ ఎక్స్టెన్షన్ చైర్మన్ దిలీప్ కుమార్ సదనాని ఈ కార్యక్రమం వెనుక ఉన్న ప్రణాళిక, లక్ష్యాలను వివరించారు. రోటరీ బ్లడ్ బ్యాంక్ డాక్టర్ పి.కామరాజు మాట్లాడుతూ ఒక యూనిట్ రక్తం ముగ్గురి ప్రాణాలను రక్షించగలదని చెప్పారు. ఈ సందర్భంగా యక్కల వీరమోహన్‌రావు, పి. సేతు మాధవరావు, క్లబ్ కోశాధికారి దామిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొని రక్తదాన ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు.


## దస్తావేజులు పడిపోయినవి

యల్లజనులకు తెలియజేయునది ఏమనగా రావులపాలెం గ్రామానికి చెందిన తోట సుబ్బారావు అను నేను రావులపాలెం మండలం, ఈతకోట గ్రామం తాలూకు సర్వే నెం. 170-1రు లో య.1.00ట్లు (దస్తావేజు నెం.744/1979రు) భూమికి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజులను జిరాక్స్ తీయించుకొనుటకు తీసుకొని వెళుతుండగా మార్గం మధ్యలో ఎక్కడో పడిపోయినవి. ఎంత వెతికినా దొరకలేదు. ఈ ఒరిజినల్ దస్తావేజులు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు అందజేయవలసినదిగా కోరుచున్నాను.

**తోట సుబ్బారావు,**
డోరు నెం. 4-205, శివాలయం వీధి, రావులపాలెం.
ఫోన్ : 7893561848

# గురుకులాల్లో ఇంటర్ అడ్మిషన్లకు రెండో కౌన్సిలింగ్



– జిల్లా గిరిజన సంక్షేమ డిడి రుక్మాగధయ్య

**రంపచోడవరం, మేజర్ న్యూస్** : గురుకులాల్లో ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్లకు రెండో కౌన్సిలింగ్ ఈనెల 17వ తేదీన నిర్వహించనున్నట్టు జిల్లా గిరిజన సంక్షేమ అధికారి యం.రుక్మాగధయ్య శనివారం తెలిపారు. రంపచోడవరం, చింతూరు ఐటీడీఏ లు పరిధిలోని 8 (బాలురు-4, బాలికలు-4) గురుకుల కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో 204 సీట్లకు (బాలురు-147, బాలికలు-57) రెండో అడ్మిషన్ కౌన్సిలింగ్ తేది: 17.06.2025 (మంగళ వారం) నాడు నిర్వహించనున్నట్టు జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రుక్మాగధయ్య పేర్కొన్నారు. బాలికలకు రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఉన్న గురుకుల బాలికల కళాశాలలో కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. బాలురకు రంపచోడవరం - మారేడుమిల్లి రహదారిలో ఉన్న గురుకుల బాలుర కళాశాలలో కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. అడ్మిషన్ కౌన్సిలింగ్ 17.06.2025 నాడు ఉదయం 9.00 గంటల నుండి ప్రారంభమవుతుందని డిడి తెలిపారు. పదో తరగతిలో వచ్చిన మార్కుల మెరిట్ ఆధారంగా విద్యార్థినీ విద్యార్థులకు సీట్లు కేటాయించబడతాయన్నారు. ఆన్‌లైన్‌లో అప్లికేషన్ పెట్టుకొని మొదట కౌన్సిలింగ్‌కు హాజరు కాని విద్యార్థులు ఈ కౌన్సిలింగ్ కు హాజరు కావచ్చునని డిడి తెలిపారు. సర్టిఫికెట్లు 3 సెట్లు జిరాక్స్ తెచ్చుకోవాలన్నారు. కౌన్సిలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు తప్పనిసరిగా ఎస్ఎస్‌సి టీసి, స్టడీ సర్టిఫికెట్, ఆన్‌లైన్ మార్కులు లిస్ట్, క్యాస్ట్ సర్టిఫికేట్, వైట్ రేషన్ కార్డు జిరాక్స్, విద్యార్థి ఆధార్ కార్డు జిరాక్స్, తల్లిదండ్రులు ఆధార్ జిరాక్స్, విద్యార్థి 5 పాస్ పోర్టు సైజ్ ఫోటోలు, తల్లిదండ్రులు బ్యాంక్ డీటెయిల్స్ జిరాక్స్, ఒక ఫైల్, పైన తెలిపిన సర్టిఫికెట్లు అన్ని 3 సెట్లు జిరాక్స్ తీసుకుని హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు గురుకుల కళాశాల కన్వీనర్ ప్రిన్సిపాల్ రంపచోడవరం వారిని సంప్రదించాలని గిరిజన సంక్షేమ డిడి రుక్మాగధయ్య కోరారు.

## జెకె సిటీ ట్రస్ట్ ఆధ్వర్యంలో నర్సింగ పేట గ్రామంలో మంచినీటి బోరు




**చింతూరు, మేజర్ న్యూస్** : చింతూరు మండలంలోని ముకునూరు గ్రామపంచాయతీ పరిధిలో నర్సింగ పేట గ్రామంలో జెకె సిటీ ట్రస్ట్ చైర్మన్ ఆయుర్వేద వైద్యులు మహమ్మద్ జమాల్ ఖాన్ త్రాగునీటి బోరును ఏర్పాటు చేసి శనివారం ప్రారంభించారు. వేసవికాలం త్రాగునీటి సమస్యతో గ్రామస్తులు ఇబ్బందులకు గురవుతున్న క్రమంలో ఈ విషయాన్ని జెకె సిటీ చైర్మన్ జమాల్ ఖాన్‌కు తమ గ్రామంలో తాగునీటి బోరు ఏర్పాటు చేయాలని విన్నవించారు. దానికి స్పందిస్తూ జమాల్ ఖాన్ వెంటనే రిగ్గును తెప్పించి డ్రిల్లింగ్ చేయించి అనంతరం బోర్ హ్యాండిల్‌ను ఏర్పాటు చేశారు. అడిగిన వెంటనే తమ త్రాగునీటి సమస్యను పరిష్కరించిన జమాల్ ఖాన్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు సన్యాసిరావు, ఉప సర్పంచ్ దుర్గ, మాజీ టిడిపి మండల అధ్యక్షులు ఎండి జహంగీర్, మార్కెట్ కమిటీ సభ్యులు పి.సాల్మన్ రాజు, గ్రామస్తులు రవ్వ భీమయ్య, బీరబోయిన సత్యనారాయణ, సోడే గంగయ్య పాల్గొన్నారు.

# మహర్షి సాంబమూర్తి ఆశ్రమ పాఠశాలలో...దివ్యాంగ బాలికలకు "యోగ శిక్షణ"



**కాకినాడ, మేజర్ న్యూస్** : అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర మాసోత్సవాలలో భాగంగా ఈరోజు ఉదయం స్థానిక కల్పనా సెంటర్ వద్ద గల మహర్షి సాంబమూర్తి దివ్యాంగుల బాలికల ఆశ్రమ పాఠశాల నందు దివ్యాంగ బాలికలకు ఉపాధ్యాయులకు ఆంధ్రప్రదేశ్ యోగ విద్య పీఠం రాష్ట్ర అధ్యక్షులు, యోగాచార్య చిట్టూరి చిట్టిబాబుచే ప్రత్యేక యోగా శిక్షణ తరగతులు నిర్వహించడమైనది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ న్యాయవాది, సాంబమూర్తి ఆశ్రమ పాఠశాల చైర్మన్ జవహర్ అలీ విచ్చేసి ఉచిత యోగ శిక్షణ తరగతులు ప్రారంభించారు. యోగతో మాత్రమే ప్రపంచాన్ని ఏకం చేయవచ్చని, విద్యార్థి దశ నుండి యోగాభ్యాసాన్ని ఒక అలవాటుగా చేసుకోవాలని దివ్యాంగ విద్యార్థులకు ఉపాధ్యాయులకు ఆయన పిలుపునిచ్చారు. అనంతరం యోగాచార్య చిట్టిబాబు యోగ శిక్షకురాలు కల్పనతో కలసి దివ్యాంగ బాలికలకు ప్రత్యేక యోగ శిక్షణ అందించారు. ఈ సందర్భంగా యోగాచార్య మాట్లాడుతూ యోగ ద్వారా అంతరంగిక పరిశుద్ధత, స్వస్థత, మనోబలం, ఆత్మవిశ్వాసం, సద్భావన, స్వీయ అవగాహన, చైతన్యంతో కూడిన జీవనం సాధ్యమవుతాయన్నారు. ఉచిత యోగ శిబిరాల్లో భాగంగా వారానికి ఒకరోజు హాస్టల్ నందు ఉచిత యోగ శిక్షణ అందిస్తామన్నారు. ఈ యోగాభ్యాస కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రామలక్ష్మి, జి.పద్మ తదితర ఉపాధ్యాయులు, దివ్యాంగ చిన్నారులు పాల్గొన్నారు.

## జగన్మోహిని కేశవస్వామి అన్నదాన పథకానికి విరాళాలు



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్** : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ర్యాలీ జగన్మోహిని కేశవస్వామివారి నిత్య అన్నదాన పథకానికి శనివారం హైదరాబాద్ భానోత్ శ్రవణ్ కుమార్, జయలక్ష్మి దంపతులు రూ.25,116లు; ర్యాలికి చెందిన తాడి నూకయ్య, నాగలక్ష్మి దంపతులు రూ.10,200లు; హైదరాబాద్‌కు చెందిన మోపిదేవి కృష్ణ మోహన్, ఉమాదేవి లు రూ.5,116లు; విశాఖపట్నంకు చెందిన మాదాబత్తుల యశ్వంత్ రూ.5,116లు; నూజివీడు మండలం రావిచర్ల కు చెందిన లావు ఆనంద ధనకోటి ప్రసాదరావు రూ.5,116 లు విరాళంగా అందించారు. వీరికి ఆలయ అర్చకులు దాతలకు ఆశీర్వచనం చేయించి, శ్రీ స్వామివారి శేష వస్త్రంతో సత్కరించారు. వీరికి ఈవో భాగవతుల వెంకటరమమూర్తి, సిబ్బంది స్వామివారి చిత్రపటం అందించారు.

## యోగాతో మానసిక రుగ్మతలు దూరం



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్** : ప్రతినిత్యం యోగ సాధన చేస్తూ ఉంటే మానసిక రుగ్మతలు దరిచేరవని ప్రత్యేక అధికారి రామారావు, ఎంపీడీవో వెంకట్ రామన్ లు అన్నారు. శనివారం బొబ్బర్లంక సర్పంచ్ నరాల శెట్టి సుబ్బలక్ష్మి అధ్యక్షతన యోగా శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యోగా సాధన కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నయన్నారు. ఇందుకోసం ప్రతి గ్రామంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతూందన్నారు. ఈ నెల 16న వాడపల్లి శ్రీనివాస ప్రాంగణంలో మెగా యోగాసనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్, ఆర్డీవో ఈ శ్రీకర్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని గ్రామస్తులంతా హాజరై జయప్రదం చేయాలి అన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ సిబ్బంది కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది, యోగా ఔత్సాహికులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం



**కాకినాడ, మేజర్ న్యూస్** : ఇటీవల వెలువడిన పదవ తరగతి పరీక్షా ఫలితాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ సంస్థ ప్రతిభా పురస్కారాలు అందించింది. సంస్థ ప్రెసిడెంట్ ఎండి హలీమ్ అధ్యక్షతన కాకినాడ అర్బన్ మరియు రూరల్ ప్రాంతాల హైస్కూల్స్‌లో చదివి ఎస్ఎస్సీ మార్చ్ 2025 స్కూల్ టాపర్స్ మరియు మెరిట్ విద్యార్థులకు శనివారం కాకినాడ సాంబమూర్తినగర్ రెవిన్యూ కాలనీలో ఉన్న హబీబియా కల్యాణమండపములో జరిగిన కార్యక్రమంలో 41 స్కూల్స్ నుండి 94 మందికి పుర ప్రముఖుల సమక్షములో సత్కారము జరిగినది.

ఈ 41 స్కూల్స్‌లో 14 మునిసిపల్ స్కూల్స్, 04 గవర్నమెంట్ స్కూల్స్, 09 జిల్లా పరిషద్ స్కూల్స్, 03 ఎయిడెడ్ స్కూల్స్, 11 ప్రైవేటు స్కూల్స్ ఉన్నాయి. మొత్తం విద్యార్థుల సంఖ్య 94. వారిలో బాలురు 36, బాలికలు 58. ఈ 94 మంది విద్యార్థులలో 32 మంది ముస్లిం విద్యార్థులు, 62 మంది ముస్లిమేతర విద్యార్థులు ఉన్నారు. 62 మంది ముస్లిమేతర విద్యార్థులలో 23 మంది బాలురు, 39 మంది బాలికలు ఉన్నారు. 32 మంది ముస్లిం విద్యార్థులలో 13 మంది బాలురు, 19 మంది బాలికలు ఉన్నారు. బాలుర కంటే బాలికలే అధిక సంఖ్యలో ఉండడం విశేషం. విద్యార్థులకు నైతిక విలువలు గూర్చి అఖిల్ అలీ బోధించగా ప్రముఖ వ్యక్తిత్వ వికాసనిపుణులు అబ్దుల్ అజీజ్ ఉన్నత చదువులపై అవగాహన మరియు ఉత్తేజపరచడం జరిగినది. సంస్థ అధ్యక్షులు ఎంపిజె చేస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. సంస్థ లీగల్ అడ్వైజర్ అడ్వకేట్ ఏజాజుద్దిన్ విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలని కోరారు. ముఖ్య అతిథి జీలాని పిల్లలను శ్రద్ధతో చదివిస్తున్నందులకు తల్లిదండ్రులను అభినందించారు. ప్రముఖ న్యాయవాది జవహర్ అలీ ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను అభినందించారు. ఆడిటర్ నిహారిక విద్యార్థులు ఉన్నత పదవులను అధిష్టించి దేశానికి సేవ చేయాలని కోరారు. ఈ కార్యక్రమములో ఎంపిజె సభ్యులు, తల్లిదండ్రులు, పుర ప్రముఖులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అందరూ రక్తదానం చేయాలి- పసుమర్తి



**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్వచ్ఛంద రక్తదానం చేయడం ద్వారా ఎంతో మందిని కాపాడిన వారవుతామని శ్రీ బ్రాహ్మణ అభివృద్ధి సమాఖ్య సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పసుమర్తి సత్యనారాయణమూర్తి అన్నారు. ప్రపంచ రక్తదాన దినోత్సవ సందర్భంగా స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని స్థానిక నూకాలమ్మ గుడి సమీపాన ఉన్న పోలిశెట్టి ప్లాజాలో అక్షయ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. తొలుత అక్షయ బ్లడ్ బ్యాంక్ చైర్మన్ కె.ప్రణీత్ స్వచ్ఛంద రక్తదాతలకు స్వాగతం పలికి రక్తదానం చేయడం వల్ల కలిగే ఫలితాలను ప్రయోజనాలను వివరించారు. రక్తదాతలకు ప్రత్యేక ఇన్సూరెన్స్ కవరేజీ అమలవుతుందని, అంతేకాక సంవత్సరం కాలంలో ఏదైనా ఇబ్బందులు ఎదురవుతే రక్తాన్ని సకాలంలో అందించడం జరుగుతుందని, అందుకు సంబంధించిన ప్రత్యేక ఐడి కార్డు కూడా దాతలకు ఇస్తామన్నారు. స్వచ్ఛంద రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలని ఆయన కోరారు.ప్రపంచ రక్త దాన దినోత్సవం సందర్భంగా శ్రీ బ్రాహ్మణ అభివృద్ధి సమాఖ్య సేవా సంఘం అక్షయ బ్లడ్ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామని ఈ సందర్భంగా పశుమర్తి సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఆ రక్తదానం చేయడం ద్వారా కనీసం ముగ్గురి ప్రాణాలను కాపాడగలమని వివరించారు .ప్రమాద బారిన పడిన వారికి, ఆపరేషన్ నిమిత్తం వెళుతున్న వ్యక్తులకు ఈ రక్తం ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. రక్తదానంపై నేటికీ అపోహలు ఉండడం దురదృష్టకరమ ని అన్నారు. సకాలంలో రక్తం లభ్యం కాక మృత్యువాత పడుతున్న వారి సంఖ్య పరిశీలిస్తే ఆందోళన కలిగిస్తోందని అన్నారు. రక్తం తయారయ్యే వస్తువు కాదని కేవలం మానవ దేహంలో నే లభిస్తుందని ఆయన చెప్పారు. కనీసం నాలుగు నెలలకు ఒకసారి అయినా రక్తాన్ని సమీప బ్లడ్ బ్యాంకులో ఇవ్వడం ద్వారా సమాజానికి మన వంతు కర్తవ్యం చేసినట్లు అవుతామని ఆయన చెప్పారు. ఆ రక్తదానం చేసేవారు ఆరోగ్యవంతులుగానే ఉంటారని, రక్తం త్వరగా తిరిగి ఉత్పత్తి అవడం ద్వారా ఆ వ్యక్తి ఎటువంటి భయపడవలసిన అవసరం లేదన్నారు. అక్షయ బ్లడ్ బ్యాంకు నిర్వహణ ఎంతో అద్భుతంగా ఉందని సిబ్బంది కూడా దాతలపట్ల ఎంతో గౌరవభావాన్ని ప్రకటించడమే కాక తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించడంలో ప్రత్యేకతలు తీసుకుంటున్నారని పశుమర్తి సత్యనారాయణ కొనియాడారు.బ్లడ్ బ్యాంక్ మేనేజర్ వెంకట్ మాట్లాడుతూ ఈరోజు 20 మంది దాకా స్వచ్ఛంద రక్తదానం చేస్తారని ఆమోదం తెలిపారని చెప్పారు. రక్తదానం చేయడం గొప్ప సామాజిక సంఘ సేవగా ఆయన ప్రస్తావిస్తూ యువతలో రక్తదానం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. అనంతరం పసుమర్తి సత్యనారాయణమూర్తికి స్వచ్ఛంద రక్తదాన సర్టిఫికెట్ ను అందజేసి అభినందనలు తెలిపారు.

# కోరమండల్ ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులు పంపిణీ




**కాకినాడ, మేజర్ న్యూస్ :** రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ కార్యాలయంలో కోరమండల్ మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నిత్యవసర సరుకులు పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా సంఘ కార్యదర్శి మల్లీశ్వరి మాట్లాడుతూ తమ సంఘ అధ్యక్షురాలు అయిన వెంకట దుర్గావతి సూచనల మేరకు ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నిత్యవసర సరుకులు ప్రతినెల అందజేస్తున్నామని అన్నారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి జీ. కృష్ణమోహన్ మాట్లాడుతూ ఒకరికి సేవ చేయడంలో లేదా సహకరించడంలో ఉన్న సంతృప్తి ఎనలేనిదన్నారు. పౌరులకు సేవ చేయడానికి భగవంతుడు మానవ జన్మని ప్రసాదించాడనే భావనను గుర్తించి ప్రతి ఒక్కరూ సేవలో తరించాలని అన్నారు. ప్రతినెలా ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నిత్యవసర సరుకులు సమకూరుస్తున్న కోరమండల్ మహిళా సంక్షేమ సంఘ సభ్యులు అభినందనీయులని కృష్ణమోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ కోశాధికారి శ్రీదేవి, సభ్యులు లక్ష్మీ సృజన, మోహిని కుమారి, మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్, శిరీష, బుద్ధ రాజు సత్యనారాయణ రాజు, చింతపల్లి సుబ్బారావు, ప్రసాద్ నాయుడు, రేలంగి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఏరువాడ గ్రామంలో విజయవంతంగా వైద్య శిబిరం






**- డాక్టర్. ఉదయ్ కుమార్ రెడ్డి**

**చింతూరు, మేజర్ న్యూస్:** ఎక్కడ వైద్య అవసరం ఉంటే అక్కడ ఉండే వైద్య సేవలే నిజమైన ఆరోగ్య వ్యవస్థకు పునాది అనే నినాదంతో ఉన్నతాధికారుల సూచనలు, సలహాలు తీసుకొని తులసిపాక వైద్యులు డాక్టర్ ఉదయ్ కుమార్ రెడ్డి, చింతూరు మండలంలోని తులసిపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో కుగ్రామమైన తులసిపాక నుండి సుమారు 15 కిలోమీటర్ దూరంలో ఉన్న 7 కొండలు దాటి ఉన్న ఏరువాడ గ్రామం లో వైద్య శిబిరం శుక్ర, శనివారం రెండు రోజులు నిర్వహించారు. భయంకరమైన అటవీ ప్రాంతంలో కొంత దూరం ట్రాక్టర్‌పై వెళ్లి కొంత దూరం కాలినడకపై వ్యయ ప్రయాసలకు కోర్చి ఏరువాడ గ్రామం చేరుకొని వైద్య సేవలు అందించారు. అక్కడ ఉన్న 25 కుటుంబాలకు ప్రతి వ్యక్తికి వైద్య సేవలు అందించారు. ప్రతి ఇంటికి మలేరియా నివారణకు ఐఆర్ఎస్ స్ప్రేయింగ్ నిర్వహించారు. దీర్ఘకాలిక వ్యాధులపై జాగ్రత్తలు చెప్పారు. పిల్లల నుండి పెద్దల వరకు అందరికీ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పిల్లలకు శుభ్రతపై విద్యా మార్గదర్శనం చేశారు. 25 కుటుంబాల్లో వంద మందికి మలేరియా జ్వరాలు అంటువ్యాధులకు చికిత్సలు చేసి, మందులు పంపిణీ చేశారు. దాతలు సహకారంతో కొండరెడ్లకు దుస్తులు, బియ్యం బస్తాలు పంపిణీ చేశారు. ఏరువాడలో జరిగిన ఆరు పెళ్లిళ్లకు ముఖ్య అతిథులుగా, చుట్టాలుగా, డాక్టర్ ఉదయ్ కుమార్ రెడ్డి, వైద్య సిబ్బంది ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గంగరాజు సూపర్వైజర్, అంజిబాబు హెల్త్ అసిస్టెంట్, నరేష్ ఫార్మాసిస్ట్, ధర్మా హెల్త్ అసిస్టెంట్, శివుడు (ఎన్ఎన్ఓ), సుశీల ఆశా వర్కర్, రాములమ్మ ఆశా వర్కర్, జ్యోతి అంగన్వాడీ టీచర్, సురేష్ ఫీడర్ (ఈయంటీ) తదితరులు పాల్గొన్నారు.

## చిరు వ్యాపారులకు కాకినాడ ఐడిఏ చేయూత



**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక నాగమల్లితోట వద్ద ఉన్న శ్రీసత్య దంత వైద్యశాలలో కాకినాడ ఐడిఎ ఆధ్వర్యాన చిరు వ్యాపారులకు వారి వ్యాపార నిమిత్తం నీడ ఇచ్చే గొడుగులు మరియు స్టాండ్‌లు అందించారు. ఈ సంధర్భంగా కాకినాడ ఐడిఎ కార్యదర్శి డా. అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ మానవాళికి సేవ చేయడం అంటే దేవునికి సేవ చేయడమే అని, తోటివారికి సహాయం చేయడం ద్వారా దైవాన్ని సేవించవచ్చని అన్నారు. ఈ వేసవి వేడి వలన చిరు వ్యాపారులకు కష్టంగా ఉందని మాకు తెలియచేసిన వెంటనే వారికి ఈ పెద్ద గొడుగులు అందచేయడం జరిగిందని అన్నారు. ఈ గొడుగులు వలన వారు ఎండ వేడిమికి లోను కాకుండా మంచి ఆరోగ్యంతో ఉంటారని అన్నారు. ఈ గొడుగులు స్వీకరించిన రాజు మరియు శ్రీనివాస్ మాట్లాడుతూ" మాకు వ్యాపార నిమిత్తం ఈ వేసవికాలం కష్టంగా ఉన్నదని తెలిపిన వెంటనే స్పందించిన డా. అడ్డాలకి మరియు కాకినాడ ఐడిఎ సంఘానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకినాడ ఐడిఎ సభ్యులు డా. శ్రీవల్లి, డా. నాగేంద్ర, డా. యేరూష, డా. చైతన్య, భవాని తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రక్తదానం





**తుని, మేజర్ న్యూస్ :** ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా తుని ఏరియా హాస్పటల్ మరియు టీమ్ తుని - పాయకరావుపేట బ్లడ్ వాలంటీర్స్ వారి సంయుక్త ఆధ్వర్యంలో రక్తదానం పట్ల అవగాహన కొరకు ఏర్పాటు చేసిన ర్యాలీ మరియు మెగా రక్తదాన శిబిరంలో అధిక సంఖ్యలో పెద్దలు మరియు యువత పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేయడం జరిగింది. అంతేకాకుండా అత్యధిక సార్లు రక్తదానం చేసిన చెక్క శ్రీరామ్ మూర్తి గుప్తా, గోళ్ళ వెంకటేశ్వరరావు, కర్రి వెంకటేశ్వరరావు రక్తదాతలను సత్కరించటం జరిగింది. ఈ కార్యక్రమంలో తుని ఏరియా హాస్పిటల్ డాక్టర్ స్వప్న, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హరి చందన్, హాస్పిటల్ సిబ్బంది మరియు టీమ్ తుని - పాయకరావుపేట బ్లడ్ వాలంటీర్స్ గ్రూప్ సభ్యులు గోనెలా వీరబాబు, కర్రీ బాబురావు, సలీం ఆషికి, కొండా జానీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## గోవింద నామస్మరణతో ప్రతిధ్వనించిన వెంకన్న ఆలయం





**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వరస్వామివారి ఆలయం శనివారం భక్తుల గోవింద నామ స్మరణతో ప్రతిధ్వనించింది. ఏడు శనివారాల వెంకన్న దర్శనం ఏడేడు జన్మల పుణ్యఫలం అనే నానుడితో రాష్ట్రాల నుండి వేలాదిమంది భక్తులు తరలివచ్చి ఏడు ప్రదక్షిణలు చేసి స్వామివారిని దర్శించి మొక్కుబడులు తీర్చుకున్నారు. స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజనం మంత్ర పుష్పం, పుణ్యా వచనం, కళ్యాణం వంటి కార్యక్రమాలను అర్చక బృందం వైభవంగా నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపింది. వచ్చిన భక్తులకు ప్రసాద వితరణ అనంతరం అన్నదానం నిర్వహించారు. శనివారం స్వామివారి ఆదాయం రూ.63 లక్షలు సమకూరింది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తరతకుండా డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# జిల్లాలో 2100 ఎకరాలలో పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహం



**-దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేదీ జూన్ 25**
**-మూడు సంవత్సరాల పాటు నిర్వహణ ఖర్చులు ప్రభుత్వమే చెల్లిస్తుంది -కలెక్టర్ పి.ప్రశాంతి**

**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్** : తూర్పు గోదావరి జిల్లా పరిధిలో పొలములలో పండ్ల తోటల పెంపకం చేపట్టే ఆసక్తి కలిగిన సన్న, చిన్నకారు రైతులకు చేయూత నివ్వడం కోసం పివో ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరంలో 2100 ఎకరములు లక్ష్యంగా నిర్ణయిచడం జరిగిందని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి శనివారం ఒక ప్రకటనలో తెలియచేసారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల పెంపకం చేపట్టుటకు జిల్లాలోని అర్హులైన సన్న / చిన్న కారు రైతుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. పూర్తి వివరాలు, తగిన సూచనలు సలహాలు కోసం మీ మండల పరిధిలోని హార్టికల్చర్ అధికారి సంప్రదించాలని సూచించారు. గత ఆర్థిక సంవత్సరం 2024-2025 లో 500 ఎకరములు లక్ష్యంగా నిర్ణయయించగా , లక్ష్యాలను మించి తూర్పు గోదావరి జిల్లాలో 643 ఎకరములలో పండ్ల తోటల పెంపక చేపట్టడమైనదన్నారు. తూర్పు గోదావరి జిల్లాలో..పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సాహం అందించడం కొరకు మామిడి, జీడిమామిడి, ఆయిల్ పాం, డ్రాగన్ ఫ్రూట్, నిమ్మ, బత్తాయి, కొబ్బరి, సపోటా, సీతాఫలం, కోకో వంటి తదితర 26 రకాల పండ్ల తోటల పెంపకం నకు అనుమతించడం జరిగిందన్నారు. మూడు సంవత్సరముల నిర్వహణ ఖర్చును రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రైతులకు ఉచితంగా చెల్లించనున్నట్లు తెలిపారు. రైతులకు కల్పించే లబ్ది కింద వివిధ రూపములలో లబ్దిదారునకు పండ్ల రకములను బట్టి ఒక ఎకరానికి 3 సంవత్సరాలకు రూ.68,103/- నుండి రూ .2,51,226/- వరకు లబ్ది చేకూరే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. జూన్ 25 వ తేది లోపు రైతులు తమ దరఖాస్తులను ఆ గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్/ గ్రామ పంచాయితీ కార్యదర్శి లేదా మండల పరిషత్ కార్యాలయము నందు అందజేయలన్నారు. అర్హులైన లబ్దిదారులు అందరు దరఖాస్తు చేసుకొని మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకమును ద్వారా చేపట్టుతున్న పండ్ల తోటల పెంపకం పని ని రైతులు సద్వినియోగం చేసుకోనవలసినదిగా డ్వామా పిడి ఎమ్ నాగమల్లేశ్వర రావు తెలియచేశారు.

## మెజిస్ట్రేట్ కోర్ట్ ఎపిపిగా ఆకుల లీలా నాగరోజా




పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : పెద్దాపురం మెజిస్ట్రేట్ కోర్ట్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఎపిపి)గా ఆకుల లీలానాగరోజా శనివారం బాధ్యతలు చేపట్టారు. న్యాయవాదుల సాధారణ బదిలీలలో భాగంగా పిఠాపురం మెజిస్ట్రేట్ కోర్ట్‌నుండి ఆమె బదిలీపై రావడం జరిగింది. ఈ మేరకు శనివారం కోర్ట్ హాలులో ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు తటవర్తి సత్యనారాయణ ఆధ్వర్యంలో బార్ కౌన్సిల్ కార్యవర్గ సభ్యులు, పలువురు న్యాయవాదులు ఎపిపిని కలిసి శుభాకాంక్షలు అందజేశారు.

## 39వ రోజుకు చేరిన మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల నిరసన



**పెద్దాపురం, మేజర్ న్యూస్** : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ ఔట్‌సోర్సింగ్ కార్మికులు, పెద్దాపురం మున్సిపల్ కార్యాలయం ఎదురుగా చేపట్టిన సమ్మె శనివారం నాటికి 39వ రోజుకు చేరుకుంది. దీనిలో భాగంగా కార్మికులు మోకాళ్ళపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ 15ఏళ్ళు సర్వీస్ పూర్తి చేసుకున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సుంకర నాగేశ్వరరావు, బాసిన భద్రరావు, కె.వెంకటరమణ, ఆకుల రామకృష్ణ, వాకాడ భాస్కర్, డి.రాజు, పి.శ్రీను, ఎం.వీరభద్రరావు, డి.భద్రరావు, జి.సతీష్, జి.నాగేశ్వరరావు, పాపారావు, అరుణ, అయ్యప్ప, స్వామి, పి.సాయి, ఎస్‌కె.బషీర్, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో యోగాంధ్ర విజయవంతం



**రాజానగరం, మేజర్‌న్యూస్** : ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం నిర్వహించిన యోగాంధ్ర 2025 కార్యక్రమం విజయవంతంగా జరిగింది. యోగాంధ్ర ప్రోగ్రాంలో భాగంగా టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి యోగా గురువు ఎన్ శివశంకర్ ప్రాణాయామం ఆసనాలను ప్రాక్టీస్ చేయించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వీసీ ఆచార్య ఎస్ ప్రసన్న శ్రీ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పిలుపు మేరకు మే 21 వ తేదీ నుండి జూన్ 21వ తేదీ వరకు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో యోగాంధ్ర 2025 పేరుతో వివిధ రకాలయోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. "వన్ ఎర్త్ - వన్ హెల్త్" నినాదంతో అందరూ యోగ సాధన చేయాలని చెప్పారు. శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం స్థాయిలో ఈ నెల 18వ తేదీన మెగా యోగాంధ్ర ప్రోగ్రామ్ ను నిర్వహిస్తున్నామని, విశ్వవిద్యాలయం ప్రాంగణం తో పాటు అనుబంధ కళాశాలలు దీనిలో భాగస్వామ్యమై విజయవంతం చేయాలని సూచించారు.

విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, ఎన్.ఎస్.ఎస్. పీఓ లు, కళాశాలల యాజమాన్యాలు యోగాంధ్ర ప్రోగ్రామ్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అలాగే విద్యార్థుల అందరూ యోగాంధ్ర పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకొనే విధంగా అధ్యాపకులు పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన భీమరాజు వైద్యం పొందుకు మృతి



**రాజవొమ్మంగి,మేజర్‌న్యూస్** : మూడు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడిన ముర్ల భీమరాజు కాకినాడ జిజిహెచ్ లో వైద్యం పొందుతూ మృతి చెందినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. మండలంలోని అప్పన్న పాలెం గ్రామానికి చెందిన టిడిపి బూత్ ఇంచార్జ్ భీమరాజు సూరం పాలెం గ్రామం సమీపంలో బైక్ అదుపు తప్పి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. వైద్యం నిమిత్తం కాకినాడ జిజిహెచ్ కు తరలించగా వైద్యం పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నామన్నారు. భీమరాజుకు భార్యనలుగురు సంతానం ఉన్నటు గ్రామస్తులు తెలిపారు. ప్రభుత్వం భీమరాజు కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

## దినచర్యలో భాగంగా యోగాను చేర్చండి

**జడ్పిటిసి జ్యోతి, టిడిపి నాయకులు తాతారావు, సర్పంచ్ మురళీకృష్ణ**
**-ప్రతిరోజు యోగాకు ప్రాధాన్యత ఇవ్వండి**
**- ఎంపీడీవో యాదగిరిశ్వరరావు**





**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్** : మన దినచర్యంలో భాగంగా యోగా సాధనను చేర్చు కుంటే ఆరోగ్యకరమైన జీవితాన్ని పొందవచ్చని జడ్పిటిసి జ్యోతి, టిడిపి సీనియర్ నాయకులు మాజీ సొసైటీ అధ్యక్షులు గణజాల తాతారావు , గ్రామ సర్పంచ్ మురళీ కృష్ణ అన్నారు. అలానే ఉద్యోగులు, విద్యార్థులు, వివిధ రకాల కార్మికులు ప్రతిరోజు యోగాకు ప్రాధాన్యత ఇస్తే మానసిక ఒత్తిడి నుండి ఉపశమనం కలుగుతుందని ఎంపీడీవో యాదగిరి ఈశ్వరరావు అన్నారు. శనివారం యోగా ఆంధ్రలో భాగంగా జడ్డంగి సచివాలయం పరిధిలో జడ్డంగి జిల్లా పరిషత్ హై స్కూల్ నందు పంచాయతీ కార్యదర్శి నగేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగ సాధన కార్యక్రమం లో జడ్పిటిసి జ్యోతి, గణజాల తాతారావు , గ్రామ సర్పంచ్ మురళీకృష్ణ పాల్గొన్నారు. అలానే రాజవొమ్మంగి గ్రామ సచివాలయం ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్ గ్రౌండ్ నందు నిర్వహించిన యోగా సాధన కార్యక్రమంలో ఎంపీడీవో యాదగిరిశ్వరరావు, ఎం ఈ ఓ 2 సూరయ్య రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సింగరెడ్డి రవి, వాసం శెట్టి గంగాధర్, సచివాలయం సిబ్బంది ఆనంద్, ప్రసన్న, తేజశ్రీ, నాగమణి, నాని , అంగన్వాడి సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

## ఆనూరు వెటర్నరి డాక్టర్‌గా డా.రాకేష్



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్** : పెద్దాపురం ఏరియా ప్రభుత్వ పశు వైద్యశాల పరిధిలో వెటర్నరి అసిస్టెంట్ సర్జన్‌లు (పశు వైద్యులు) బాధ్యతలు చేపట్టారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీలలో భాగంగా ఆర్.బి.పట్నం వెటర్నరి అసిస్టెంట్ సర్జన్‌గా విధులు నిర్వహిస్తున్న డా.రాకేష్ ఆనూరు వి.ఏ.ఎస్.గా వెళ్ళడం జరిగింది. అక్కడ విఏఎస్‌గా విధులు నిర్వహిస్తున్న డా.అన్నపూర్ణ నాయుడు రాజమహేంద్రవరం డివిజనర్ రంప ఎర్రంపాలెం విఏఎస్‌గా వెళ్ళారు.

అలాగే ఆర్.బి.పట్నం విఏఎస్‌గా బిక్కవోలు మండలం రాయవరం గ్రామం నుండి డా.గోలి వీర్రాజు రావడం జరిగింది. వీరు శనివారం పెద్దాపురం ఏరియా ప్రభుత్వ పశు వైద్యశాల నందు బాధ్యతలు స్వీకరించారు.